# మతభక్తి



# పరలోకానికి టికెట్ కాదు

**చు**రుకైన వ్యాపారవేత్త, క్రైస్తవ సంఘ నాయకుడు ఒకసారి తీవ్రమైన వ్యాధితో ఆసుపత్రిలో చేరాడు. అంతకుముందు ఎన్నడూ అతడు దేవునితో తన సంబంధం గురించి, తాను మరణిస్తే ఎక్కడికి వెళతానని ఆలోచించలేదు. కానీ ఇప్పుడు ఆస్పత్రిలో చేరడం వల్ల అతనికి ఆలోచించే సమయం వచ్చింది. అతనికి ఆందోళన కలిగింది.

## స్నేహితుని మాట

అతణ్ణి సందర్శించడానికి ఒక స్నేహితుడు వచ్చాడు. మరణం గురించిన ప్రస్తావన వచ్చేసరికి అతడు ఇలా అన్నాడు, "నీలాగానే నేనూ కొంతకాలం క్రితం మరణ ద్వారం వరకూ వెళ్ళాను. అయితే దేవుణ్ణి కలుసుకోవాలనే తలంపు నన్నేమీ భయపెట్టలేదు. ఎందుకంటే పరలోకానికి ఒకే ఒక టికెట్‌గా యేసు ప్రశస్థ రక్తంపై నమ్మకముంచాలని నేను అప్పటికే నిర్ణయించుకున్నాను."

ఆ రోగి కొద్దిగా పైకి లేచి "ఈ మధ్య మరణం గురించి ఎక్కువగా ఆలోచిస్తున్నాను. పరలోకానికి వెళ్ళడం ఖాయం అనిపించేటంత భక్తిగా నేను లేనేమోననిపిస్తున్నది. ఇది ఖచ్చితంగా తెలుసుకొనేందుకు నా డబ్బంతా ఇచ్చేస్తాను" అన్నాడు.

ఆ స్నేహితుడు అన్నాడు, "ఒక విషయం నీకు స్పష్టంగా చెప్పనీ. మతభక్తి అనేది పరలోకానికి టికెట్ కాదు. మతం ఎన్నడూ ఎవరికీ దేవునితో సఖ్యత చేకూర్చలేదు. లేక పరలోక నిశ్చయత ఇవ్వలేదు. యేసుక్రీస్తు రక్తం మాత్రమే అలా చేయగలదు."



రోగికి ఆశ్చర్యం వేసింది. మనిషి ఈ లోకంలో పాటించగలిగిన అతి శ్రేష్ఠమైనది మతం అని అతడు ఇంతవరకూ అనుకొన్నాడు. "మారుమనస్సు", "రక్షణ", "తిరిగి జన్మించడం", "రక్తం ద్వారా శుద్ధుడు కావడం" మొదలైనవన్నీ "మతం" అనే పదంలాటివే అనుకున్నాడు.

## దేవుడు చెప్పే మాట

అతడు అయోమయంలో, ఆందోళనలో ఉండడం చూసి అతని స్నేహితుడు బైబిలులోనుంచి చదివి వినిపించాడు. ఈజిప్టులో దేవుడు మోషేకు చెప్పిన మాటలు. "ఒక్కొక్కడు ఒక గొర్రెపిల్లను తీసికొనవలెను ... దాని చంపి దాని రక్తము కొంచెము తీసి ... యిండ్ల ద్వార బంధపు పైకమ్మి మీద చల్లి ... ఆ రాత్రి నేను ఐగుప్తుదేశమందు సంచరించి ... మనుష్యులలోనే గాని, జంతువులలోనే గాని తొలి సంతతిని హతముచేసి ఐగుప్తు దేవతలందరికిని తీర్పు తీర్చెదను. నేను యెహోవాను. మీరున్న యింట్ల మీద ఆ రక్తము మీకు గురుతుగా నుండును. నేను ఆ రక్తము చూచి మిమ్మును నశింపజేయక దాటిపోయెదను" (నిర్గమ 12:3-13).

చిందించిన ఆ రక్తంపై నమ్మకం ఉంచి వారు ద్వార బంధాలపై పూసిన ఆ రక్తమే ఆ రాత్రి ఆ యింటివారిని కాపాడింది. మిగిలినవారంతా, వారెంత మంచివారైనా నశించిపోయారు.

ఆ రోగి వెంటనే లేచి కూర్చుని "నాకు అర్థం అయింది. రక్తంలోనే ఉంది మహిమ. ఇన్నేళ్ళుగా నా మంచి పనులమీదే నమ్మకం పెట్టుకున్నాను. ఇప్పుడు తెలిసింది, మతభక్తి ఏమీ లాభం లేదు. పరలోకానికి నాకున్న ఒకే టికెట్ క్రీస్తు రక్తమే."

## నీకొక మాట

మతం తమను రక్షిస్తుందని నమ్మేవారు చాలామంది ఉన్నారు. తమ సత్క్రియలు తమను పరలోకం తీసుకు వెళతాయని నమ్మేవారు ఉన్నారు. కానీ దేవుడు స్పష్టంగా ప్రకటిస్తున్నాడు, "ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1యోహాను 1:7). "రక్తము చిందించకుండ పాపక్షమాపణ కలుగదు" (హెబ్రీ 9:22). పరలోకానికి నీ టికెట్‌గా యేసు రక్తంపై నమ్మకముంచావా?

క్రైస్తవ సత్య గ్రంథశాల
ప్యాడిసన్‌పేట, తెనాలి-522 201
Christian Truth Book Room, Paddisonpet, Tenali-522 201